క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



బుచ్చమ్మ దేవత ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం సమీపంలో బైపాస్ రోడ్డులో బుచ్చమ్మ దేవత ఆలయ నిర్మాణానికి శనివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. గతంలో ఇక్కడ వేపచెట్టు కింద అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో వేపచెట్టును తొలగించడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. దాని స్థానంలో నూతనంగా దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. వేదపండితుడు మంజునాథ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నెట్టెం రామకృష్ణ, బొల్లినేని వెంకటేష్, బొమ్మినేని శ్రీరాములు, సురేంద్ర నాయుడు, అప్పస్వామి, నెట్టెం మల్లికార్జున, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న దాసెట్టి కుటుంబ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యర్రగుంటలో నూతనంగా నిర్మిస్తున్న వైద్య నారాయణ ధన్వంతరి, త్యాగరాజ స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణ చేనేత ప్రముఖులు దాసెట్టి సుబ్రహ్మణ్యం, దాసెట్టి నాగరాజు, దాసెట్టి శ్రీనివాసులు రూ.లక్ష విరాళం అందించారు. పట్టణంలోని వారి నివాసంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులకు దాసెట్టి ఓబులమ్మ జ్ఞాపకార్థం వారి భర్త దాసెట్టి నారాయణ స్వామి, కుమారులు సుబ్రహ్మణ్యం, నాగరాజు, శ్రీనివాసులు విరాళం అందించారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి



వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: రామాయణం రచించిన వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి తెలిపారు. మద్దెలచెరువు గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహానికి కలశం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుతిప్రసాద్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మండల కేంద్రం చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి మిత్రులతో స్నేహం చేయాలని, లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు కష్టపడాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, కొత్త చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబుళమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంమంత్రి రాజీనామా చేయాలి

ధర్మవరం: బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం పట్టణ కార్యదర్శి జంగాపల్లి పెద్దన్న మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధానమంత్రిని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, రైతు సంఘం కార్యదర్శి మారుతిప్రసాద్, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజా పాల్గొన్నారు.

నష్టాల పాలు



పాడి రైతులపై కూటమి సర్కారు కక్ష కట్టింది. ఇప్పటిదాకా గిట్టుబాటు ధరలతో పాలు కొనుగోలు చేస్తున్న అమూల్ డెయిరీలను రద్దు చేసింది. దీంతో ప్రైవేట్ డెయిరీల్లో పాలు విక్రయించాల్సి వస్తోంది. అయితే ప్రైవేట్ డెయిరీలు తక్కువ ధరతో పాలు సేకరిస్తుండటంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.

- 'అమూల్' మూతతో భారీ దెబ్బ
- ప్రైవేట్ డెయిరీల ఇష్టారాజ్యం
- గణనీయంగా ధర తగ్గింపు
- లబోదిబోమంటున్న పాడి రైతులు

గాండ్లపెంట: వ్యవసాయం తర్వాత అత్యధిక మంది ఉపాధి పొందుతున్నది పాడి పరిశ్రమ రంగం. కదిరి నియోజకవర్గంలో ఆవులు, గేదెలు 55,499 ఉన్నాయి. వీటి నుంచి రోజూ 50 వేల నుంచి 60 వేల లీటర్ల పాల దిగుబడి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమూల్ సంస్థ ద్వారా డెయిరీలు ఏర్పాటు చేసి.. అక్కడ గిట్టుబాటు ధరకు పాలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో కలిపి మొత్తం 117 డెయిరీలు ఉండేవి. అప్పట్లో ఆవు పాలు లీటరు రూ.35 నుంచి రూ.40, గేదె పాలకు గిట్టుబాటు ధర రూ.60 నుంచి రూ.80 లభించేది. 'అమూల్' డెయిరీల రద్దుతో పాడి రైతులపై పిడుగు పడినట్లయ్యింది. ప్రైవేటు డెయిరీలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. పాల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రస్తుతం లీటర్ ఆవు పాలకు రూ.28 నుంచి రూ.33, గేదె పాలకు రూ.55 నుంచి గరిష్టంగా రూ.60 లభిస్తోంది. అది కూడా వెన్న శాతాన్ని బట్టి వస్తోందని పాడి రైతులు చెబుతున్నారు.

పాల ధరలు కనిష్టం- గరిష్టం ఇలా...

రకం	'అమూల్' (గతంలో)	ప్రైవేట్ డెయిరీలు (ప్రస్తుతం)
గేదె పాలు	రూ.60 - రూ.80	రూ.55 - రూ.60
ఆవు పాలు	రూ.35 - రూ.40	రూ.28 - రూ.33

కదిరి నియోజకవర్గంలో పాడి పశువుల గణాంకాలు

ఆవులు, గేదెలు 55,499

రోజువారి డెయిరీలకు పాల విక్రయం 50 వేల నుంచి 60 వేల లీటర్లు

ఆదాయం తగ్గింది



గతంలో అమూల్ డెయిరీలకు పాలు పోశాం. అప్పట్లో లీటరు గేదె పాల ధర రూ.65 నుంచి రూ.80 దాకా పలికేది. ఆ సమయంలో ప్రైవేటు డెయిరీ సైతం అదే ధర ఇచ్చేవారు. 'అమూల్' డెయిరీలను తొలగించడంతో ప్రైవేటు డెయిరీలు లీటరు పాలకు రూ.50 నుంచి రూ.60 చెల్లిస్తున్నారు. కొవ్వు, ఎస్‌ఎన్‌ఎఫ్ శాతాన్ని బట్టి లీటరు పాలకు వచ్చేది ఇంతే అంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు డెయిరీలకు పోస్తున్నా. – సుధాకరరెడ్డి, పాడి రైతు, సోమయాజులపల్లి

డెయిరీలోనే దాణా కొనాలి



నాకు ఒక గేదె, రెండు ఆవులు ఉన్నాయి. ఉదయం 8 లీటర్లు, సాయంత్రం 8 లీటర్ల పాలు ఇస్తున్నాయి. గేదె పాలకు ధర రూ.50 నుంచి రూ.60, ఆవుపాలకు రూ.28 నుంచి 30 వరకు వస్తోంది. పాల ధర గిట్టుబాటు కాకున్నా దాణా కూడా డెయిరీలోనే తీసుకోవాలి. దాణా బస్తా ధర రూ.1,300 చెల్లించాలి. గతంలో గేదె పాలు లీటరు రూ.70 నుంచి రూ.80 వరకు వచ్చేది. ప్రస్తుత ధరలతో 'పాడి' ఆదాయం తగ్గుతోంది. – వెంకటరమణమ్మ, సోమయాజులపల్లి

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



బహుమతులు అందజేస్తున్న న్యాయమూర్తులు జయలక్ష్మి, ప్రతిమ

కదిరి అర్బన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జితో పాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు.. వారి ఆశలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుని పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. అంతకుముందు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, ప్రిన్సిపాల్ రమ, మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠకులకు సౌకర్యాలు కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను, పుస్తకాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయం వల్ల కలిగే లాభాలను వివరించి పాఠకుల పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శాంతమ్మ పాల్గొన్నారు.

సెస్సు వసూలు చేయండి

బత్తలపల్లి: గ్రంథాలయాలకు పాఠకులు అధిక సంఖ్యలో వచ్చేలా చూడాలి. వారి నుంచి సెస్సు వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వస్తున్న వివిధ పత్రికలు, వార పత్రికలు, మ్యాగజైన్లు, కాంపిటేటివ్ పుస్తకాలు తదితర వాటిపై బత్తలపల్లి శాఖ గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రేషన్ సరుకులు సక్రమంగా చేర్చండి



స్టాక్‌పాయింట్‌లో సరుకులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం సరఫరా చేసే రేషన్‌ను షాపులకు సక్రమంగా చేర్చాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ స్టాక్‌పాయింట్ అధికారిని ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి స్టాక్ పాయింట్‌ను ఆర్డీఓ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో మండల వ్యాప్తంగా ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఎస్‌డీటీ సావిత్రమ్మ, ఆర్‌ఐ నరసింహమూర్తి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

చెన్నేకొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీఓ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో ఎక్కడకు వెళ్లారని హెల్పర్‌ను అడుగగా సెక్టార్ మీటింగ్‌కు వెళ్లారని తెలిపారు. ఈరోజు ఏమి తిన్నారని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం: పట్టణంలో సర్వీస్ ప్రొవైడర్ల అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని మెప్మా విభాగం, హోమ్ ట్రయాంగిల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రకాలైన సర్వీస్ ప్రొవైడర్లు కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ (టీవీ, ఏసీ, గీజర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫయర్ రిపేర్ చేసేవారు), బ్యూటీషియన్(మెన్, ఉమెన్) తదితర సేవలు అందించే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించి ఎన్‌ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి కల్పించడం జరుగుతున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 5వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నామని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులందరూ ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, విద్యార్హత సర్టిఫికెట్లు, 2 పాస్‌ఫోటోలు అన్ని జిరాక్స్ తీసుకుని మెప్మా విభాగంలో సంప్రదించాలని సూచించారు.

దుప్పట్ల పంపిణీ

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు శనివారం రాజీవ్ చౌదరి, అనూష దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. తమ కుమార్తె పూజ సంహిత పుట్టిన రోజు సందర్భంగా దుప్పట్లు అందజేశామన్నారు.

సహజీవనం చేయాలని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్: సహజీవనం చేయాలని ఓ మహిళను వేధిస్తున్న వ్యక్తి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. పట్టణంలోని రాయచోటి రోడ్డు పాట్టి కొట్టాల వీధిలో నివసిస్తున్న దిల్షాద్‌కు ఇది వరకే పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో మనస్పర్థలు వచ్చి విడిపోయింది. కొంతకాలంగా రాజీవ్‌నగర్‌లో ఉన్న మాజీ భర్త స్నేహితుడైన యర్రమంచి రామాంజనేయులు సహజీవనం చేయాలంటూ దిల్షాద్‌ను వేధిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో దిల్షాద్ ఇంటి వద్దకు వచ్చిన యర్రమంచి రామాంజనేయులు.. కిటికీలో నుంచి ఇంట్లోకి పెట్రోల్ పోశాడు. ఇంటి గుమ్మం ముందు ఉన్న మ్యాట్‌కు నిప్పు పెట్టి భయందోళనకు గురి చేశాడు. బాధితురాలు దిల్షాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చెత్త తొలగించాలి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గార్బేజ్ పాయింట్లలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని గార్బేజ్ పాయింట్లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులతో తీయించారు. దుర్వాసన రాకుండా ఉండేందుకు బ్లీచింగ్ చల్లించారు. బలిజ కళ్యాణ మండపం సమీపంలో ఊటనీరు వస్తుండటంతో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీర్లకు సూచించారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందిస్తున్న రైతు నవీన్ కుమార్

నల్లమాడ: రైతు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పరిగి మండలం శాసనకోటకు చెందిన రైతు నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నవంబర్ 17న సొంత ఎడ్లబండిపై స్వగ్రామం నుంచి బయలుదేరిన నవీన్.. తిరుగు ప్రయాణంలో శనివారం నల్లమాడకు చేరుకున్నారు. ఆర్‌ఓఆర్ భూ సమస్యలపై చర్చించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందించారు. యువ రైతులను ప్రోత్సహించేలా ప్రోత్సాహకాలు అందించి, కౌలు రైతులకు అన్ని రకాల పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఉద్యాన దిగుబడులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్స్ కో-ఆర్డినేటర్ గంగరాజు, స్థానిక రైతులు చంద్రశేఖర్ రెడ్డి, చంద్ర, క్రిష్ణమూర్తి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లచెరువు: కదిరి సమీపంలోని గట్లు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బి.రమేష్ నాయక్ గాయపడ్డాడు. అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ ఆదేశాలతో నల్లచెరువు మాజీ సర్పంచ్ రవికుమార్ రెడ్డి శనివారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.16 వేల ఆర్థికసాయం అందజేశారు. బాలేపల్లి తండా సర్పంచ్ సోనాలమ్మ, నాయకుడు హైటెక్ రమణతో పాటు పలువురు నాయకులు రమేష్ నాయక్‌ను పరామర్శించారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడి మృతి



తప్పెట కాటమయ్య (ఫైల్)

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు, రంగస్థల నటుడు తప్పెట కాటమయ్య (65) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాటమయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోటి సురేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అక్కిం నరసింహులు, పోట్లమర్రి సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట రామాంజనేయులు, కోఆప్షన్ మెంబర్ కరీం సాబ్, నాయకులు సంగాలప్ప, పాల్యం అప్పస్వామి, ముసుగు సాంబ, పామాల నాగభూషణ, ముసలప్ప పాల్గొన్నారు. అదేవిధంగా బత్తలపల్లిలోని రంగస్థల కళాకారులు శరాబ్ యోగానంద ఆచారీ, బోరు శివయ్యలతో పాటు మరికొందరు కళాకారులు మృతుడికి నివాళులర్పించారు.

భూ సమ్యలపై విచారణ

నల్లమాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కోర్టు నిర్వహించారు. మండల పరిధిలోని భూ సమస్యలకు సంబంధించి కేసులను విచారించారు. కేసులకు సంబంధించిన ఇరువర్గాలను పిలిపించి చర్చించారు. భూ సమస్యలకు సంబంధించి గతంలో 16 మంది అర్జీలు ఇవ్వగా.. ఆర్‌డీఓ వాటిపై విచారణ జరిపినట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని గాండ్లవారిపల్లిలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని శనివారం యేసుకృపా మినిస్ట్రీస్ రాచానపల్లి ఆధ్వర్యంలో 87 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి నాగరాజు, ఉప సర్పంచ్ చిన్నప్పయ్య, కోనయ్య, వేమనారాయణ, చంద్రప్ప, నాగయ్య, పోతుశివ, లలితమ్మ, ఫిలిఫ్, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం



తోపుడు బండ్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి

పుట్టపర్తి టౌన్: స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహల్లాద పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త తరలించేందుకు నాలుగు తోపుడు బండ్లను జెండా ఊపి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు పట్టణ శుభ్రతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రోజూ మీకు నిర్దేశించిన ప్రాంతాల్లో చెత్తను తొలగించి, శుభ్రంగా ఉంచాలన్నారు. ఇందుకోసం చెత్త తరలించే నాలుగు బండ్లను రూ.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. వార్డుల్లో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శివయ్యతో పాటు సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలపై అవగాహన అవసరం. చట్టాలను అడ్డుపెట్టుకొని దుర్వినియోగపరచవద్దని బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ప్రాథమిక హక్కులు, పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురై ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తారన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పెత్తందార్లు వెట్టి చాకిరి చేయించడం, దౌర్జన్యాలు చేస్తుంటే, బాలకార్మికులను వేధిస్తుంటే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ను దుర్వినియోగం చేయొద్దని సూచించారు. గ్రామాల్లోని ప్రజలందరూ సామరస్యంగా జీవించాలన్నారు. ఘర్షణలు, కక్షలకు తావివ్వవద్దన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సోమశేఖర్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుపేటలో సివిల్ రైట్స్ డే

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సుబ్బారావుపేట గ్రామంలో శనివారం రాత్రి సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలపై కాలనీ వాసులకు ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. అదే విధంగా మహిళలపై జరుగుతున్న దాడులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీదేవిని సన్మానిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: అందరి మన్ననలు పొందేలా విధులు నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉంటుందని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ తహసీల్దార్ గాజుల లక్ష్మీదేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పదవి విరమణ పొందడం సహజమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీదేవి వృత్తినే దైవంగా భావించి సమయపాలన పాటిస్తూ సేవలందించారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు నటరాజ్, స్వర్ణలత, జమినిల్లాఖాన్, ప్రసాద్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అర్జీల స్వీకరణ

ఎన్పీకుంట: గ్రామ పంచాయితీలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్ర నాయక్ సూచించారు. మండల పరిధిలోని మేకలచెరువు పంచాయితీ కేంద్రంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలకు సంబంధించి 6 అర్జీలు వచ్చాయి. ఫ్రీ సర్వీసెస్ కింద 8 మందికి కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేసినట్లు తెలిపారు. 31వ తేదీన ముదుపులజీవి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల సర్వేయర్ జీలాని పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా బాబ్జాన్

ఎన్పీకుంట: బీజేపీ మండల అధ్యక్షుడుగా షేక్‌బాబ్జాన్ (గుజిరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ ఎన్నికల రిటర్నింగ్ సభ్యులు రమేష్ నాయుడు, ఏఆర్‌ఓ ఉత్తమ్‌రెడ్డి సమక్షంలో బాబ్జాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం



అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో శనివారం గోవింద మాలధారణ సేవా కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గోవింద మాలధారణ సేవా కమిటీ గురుస్వామి దేవతా కృష్ణమూర్తి నేతృత్వంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని జరిపించారు. అన్నదానం అనంతరం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా కమిటీ సభ్యులు అన్నం రామంజనేయులు, జయంతి నాగానంద ప్రసాద్, వెంకటరమణ, బీరే నాగేశ్వరరావు, సంజీవ రాయుడు, కరుణాకర్, నారాయణ స్వామి, బాలకృష్ణ, నాగరాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.